క్లుప్తంగా

ఎంపీవో బాధ్యతల స్వీకరణ



ఎంపీవో జెన్నీ

పెడన: మండలం వ్యవసాయశాఖ అధికారిణిగా సజ్జా జెన్నీ బాధ్యతలను స్వీకరించారు. ఈమె రంపచోడవరం డివిజన్‌లోని దేవీపట్నం ఎంఏవోగా విధులు నిర్వహిస్తూ డిప్యూటేషన్‌పై కృత్తివెన్ను మండలంలో ఏవోగా విధులు నిర్వహించారు. వ్యవసాయశాఖ చేపట్టిన బదిలీల్లో భాగంగా కౌన్సెలింగ్‌లో పెడన కోరుకున్నారు. పెడన ఎంఏవోగా బాధ్యతలను తీసుకున్నారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న మచిలీపట్నం సాయిల్‌టెస్ట్ ఆగ్రి ల్యాబ్‌లో ఏవోగా విధులు నిర్వహిస్తున్న నూరున్నీసా పెడన ఇన్‌చార్జి ఏవోగా విధులు నిర్వహించగా ఈమె నుంచి జెన్నీ బాధ్యతలను తీసుకున్నారు. సోమవారం నుంచి పూర్తిస్థాయి విధులకు హాజరుకానున్నట్లు ఆమె 'సాక్షి'కి తెలియజేశారు.

పార్వతీదేవి అమ్మవారికి లక్ష మల్లెలతో అర్చన



బంటుమిల్లి: మండల పరిధిలోని పెదతుమ్మిడి గ్రామంలో కొలువై ఉన్న శ్రీ పార్వతి సమేత అగస్తేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి సువాసినిలచే అమ్మ వారికి లక్ష మల్లెలార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మట్టా నాగబాబు దంపతుల పర్యవేక్షణలో పలువురు ముత్తైదువలు పాల్గొన్నారు. పండితులు సోమరాజుపల్లి ఈశ్వరశర్మ శిష్య బృందం వేద మంత్రాల మధ్య స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారికి లక్ష మల్లెల పూజ భక్తి,శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు జల్లూరి శరభయ్యగుప్త తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



బంటుమిల్లి: మండల పరిధిలోని 216 జాతీయ రహదారిపై శనివారం పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించి అపరాధ రుసుముగా రూ.2925 వసూలు చేశారు. ఎస్‌ఐ గణేష్‌కుమార్ పర్యవేక్షణలో సిబ్బంది రహదారిపై పెద్ద ఎత్తున వాహనాలను ఆపి రికార్డులు పరిశీలించారు. గతంలో చలానాలు చెల్లించనివారు, సరైన ధ్రువపత్రాలు లేనివారికి జరిమానాలు విధించి ఆన్‌లైన్‌లో చలానాలు కట్టించారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్త మృతికి నివాళి



కోడూరు: వైఎస్సార్ సీపీ కార్యకర్త, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీరాభిమాని ముక్కొల్లు రాముడు (63) శనివారం గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. రాముడు వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి విధేయుడిగా పని చేశాడు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తూ ప్రతి కార్యక్రమంలో పాల్గొన్నాడు. అయితే ఇటీవల రాముడికి గుండె ఆపరేషన్ నిర్వహించారు. ఇంటి వద్ద కోలుకుంటున్న రాముడుకు శనివారం ఉదయం మళ్లీ గుండె పోటు రావడంతో హఠాన్మరణం చెందాడు. విషయం తెలుసుకున్న పార్టీ నేతలు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. పార్టీ మండలాధ్యక్షుడు పరిశె మాధవరావు, ఎస్సీ సెల్ కన్వీనర్ వెన్నా ప్రసాద్, ఎంపీటీసీ బడే గంగాధరరావు నివాళులర్పించినవారిలో ఉన్నారు.

మొవ్వ వైద్యాధికారి బదిలీ

మొవ్వ: మొవ్వ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎం.వేద రాజ్ చిత్తూరు జిల్లా కుప్పం వైద్యశాలకు బదిలీ అయ్యారు. ఇటీవల నిర్వహించిన సాధారణ బదిలీల్లో భాగంగా ఈయన బదిలీ అయ్యారని అధికారులు శనివారం తెలిపారు. ఈ స్థానంలో ఎవరినీ నియమించలేదు.

అటు యోగా ఫీట్లు..
ఇటు ప్రయాణికుల పాట్లు

- యోగాంధ్రకు జిల్లా నుంచి 250 బస్‌లు
- బస్ సర్వీసులు లేక వెలవెల బోయిన బస్టాండ్లు
- ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు



బస్టాండ్‌లో బస్సులకోసం ప్రయాణికుల ఎదురుచూపులు



బస్‌లు లేక వెలవెల బోతున్న మచిలీపట్నం బస్టాండ్

మచిలీపట్నంటౌన్: జిల్లాలో ఆర్టీసీ బస్ సర్వీసుల లేమితో ప్రయాణికులు గత రెండు రోజులుగా నానా ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్నంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమానికి జిల్లాలోని ఐదు డిపోల నుంచి ఈ నెల 19వ తేదీ రాత్రి 250 బస్ సర్వీసుల్లో యోగా సాధకులు విశాఖపట్నానికి తరలి వెళ్లారు. దీంతో రెండు రోజులుగా జిల్లాలోని పలు రూట్లలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల సర్వీస్‌లు పూర్తిగా రద్దు కావటంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు.

ఆర్టీసీ డిపోలవారీగా..

జిల్లాలోని మచిలీపట్నం డిపో నుంచి 60 బస్‌లు, అవనిగడ్డ నుంచి 62, గుడివాడ నుంచి 63, ఉయ్యూరు నుంచి 30, గన్నవరం నుంచి 35 బస్‌లు విశాఖపట్నానికి పంపారు. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, అల్ట్రా పల్లె వెలుగు సర్వీస్‌లను పంపారు. దీంతో ఆయా రూట్లలో సర్వీస్‌లు పూర్తిగా రద్దు కావటంతో గ్రామీణ ప్రాంత ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

గంటల తరబడి నిరీక్షణ..

డిపోల పరిధిలోని బస్ సర్వీస్‌ల కొరతతో బస్టాండ్‌లు వెలవెల బోయాయి. మచిలీపట్నం బస్టాండ్లో బస్‌ల కోసం ప్రయాణికులు గంటల కొద్దీ ఎదురుచూసి గంట, గంటన్నర సమయానికి వచ్చే సర్వీస్‌లలో ప్రయాణించాల్సివచ్చిందని కొందరు ప్రయాణికులు పేర్కొన్నారు.

విజయవాడకు వెళ్లే ప్రయాణికులకు నాన్‌స్టాప్ సర్వీస్‌లు ఆలస్యంగా తిరగటంతో ఇబ్బంది పడ్డారు. విశాఖపట్నం వెళ్లిన బస్‌లు శనివారం రాత్రికి డిపోలకు చేరనున్నాయి. ఆదివారం నుంచి పలు రూట్లలో బస్ సర్వీస్‌లు యథాతథంగా తిరగనున్నాయి.

గవర్నర్ పర్యటన ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధరరావు

చిలకలపూడి(మచిలీపట్నం): ఈ నెల 25వ తేదీన రాష్ట్ర గవర్నర్ కృష్ణా యూనివర్సిటీకి రానున్న నేపథ్యంలో శనివారం సాయంత్రం కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ ఆర్.గంగాధరరావు తదితరులు యూనివర్సిటీని పరిశీలించారు. కృష్ణా విశ్వవిద్యాలయం స్నాతకోత్సవ కార్యక్రమం సందర్భంగా ఆయన పర్యటన ఉండటంతో రాజ్‌భవన్ ఏడీసీ రామాంజనేయులుతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. విశ్వవిద్యాలయంలో నూతనంగా నిర్మించిన క్యాంటీన్ భవనాన్ని కూడా గవర్నర్ ప్రారంభించనున్నారు. ఆ భవనాలను, పరిసర ప్రాంతాలను పరిశీలించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ భవనం ముందు నేలను చదును చేసి చుట్టుపక్కల ఉన్న మొక్కలను తొలగించి సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. స్నాతకోత్సవంలో డిగ్రీలు అందుకుంటున్న విద్యార్థులతో గవర్నర్ గ్రూప్ ఫొటో వేదికతో పాటు గ్రీన్‌రూమ్ ఏర్పాటు చేయాల్సిన ప్రాంతాలను పరిశీలించారు. పరిపాలనా భవనంలో లిఫ్ట్ పనిచేసే తీరును ధ్రువీకరించి సర్టిఫికెట్ ఇవ్వాలని విద్యుత్‌శాఖ అధికారులకు సూచించారు. అతిథులు విజయవాడ నుంచి మచిలీపట్నం వరకు చేరుకునే సమయంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని, కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ, విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ కె.రాంజీ, నోడల్ అధికారి షేక్ షాహెద్‌బాబు, ఆర్డీవో కె.స్వాతి, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఉష, ఆర్‌అండ్‌బీ ఈఈ లోకేష్, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఎస్.శర్మిష్ఠ, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

24న మండల పరిషత్ సమావేశం

మోపిదేవి: ఈనెల 24వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో స్వర్ణభారతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ రావి దుర్గావాణి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

ఆలయ ఈవో బాధ్యతల స్వీకారం



ఈవోలు ఆంజనేయస్వామి, సుబ్బారెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

మచిలీపట్నంటౌన్: నగరంలోని రాబర్ట్‌సన్‌పేటలో వేంచేసి ఉన్న శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా సమ్మెట ఆంజనేయస్వామి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం కార్యనిర్వహణాధికారిగా పని చేస్తున్న సుబ్బారెడ్డి నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆంజనేయస్వామి బచ్చుపేట శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారిగా పని చేస్తూ ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో రామలింగేశ్వరస్వామి ఆలయానికి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఆంజనేయస్వామిని, బదిలీపై వెళుతున్న సుబ్బారెడ్డిని ఆలయ మాజీ చైర్మన్ దేసు సుబ్రహ్మణ్యేశ్వరరావు, సిబ్బంది సత్కరించారు.

సర్పంచులకు పూర్తి అధికారాలు ఎక్కడ?

మండల సమావేశంలో సర్పంచి నిలదీత



అధికారులను నిలదీస్తున్న మంగళాపురం సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు

చల్లపల్లి: అధికారంలోకి రాగానే గ్రామ సర్పంచులకు ఫుల్ పవర్స్ ఇస్తామన్న డెప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఇప్పటివరకూ ఎందుకు ఇవ్వలేదని మంగళాపురం గ్రామ సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు ప్రశ్నించారు. శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కోట విజయరాధిక అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఉపాధి పనుల వివరాలు చదువుతుండగా సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు మాట్లాడుతూ అవసరమైన చోట ఉపాధి పనులు చేయకపోవటంతో సమస్యలుగానే మిగిలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రెయినేజీ ఏఈ చిరంజీవి మాట్లాడుతుండగా సర్పంచ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ మంగళాపురంలోని ముంపు సమస్య ఉన్న డ్రెయినేజీలో పూడిక తీత పనులకు నిధులు మంజూరు చేయకుండా, అవసరం లేని చిల్లల వాగుకు రూ.19 లక్షలు పూడిక తీత నిధులు మంజూరు చేయటంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రాధాన్యతా క్రమంలో చిల్లలవాగు మేజర్ డ్రెయిన్ అయినందువల్ల తొలుత దానికి నిధులు కేటాయించారని ఏఈ సమాధానం చెప్పారు. డ్రెయిన్‌లోని పిచ్చిమొక్కలైనా తొలగించి సమస్యను కొంత వరకు పరిష్కరించాలని ఎంపీడీవో ఎ.వెంకటరమణ సూచించారు. మంగళాపురం జగనన్న కాలనీలో రోడ్లు లేక, విద్యుత్ లైన్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నాగేశ్వరరావు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఉన్నతాధికారుల నుంచి అనుమతులు రాగానే సౌకర్యాలు కల్పిస్తామని హౌసింగ్ ఏఈ ధర్మేంద్రరావు వివరణ ఇచ్చారు. కొడాలి మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ తోట కనకదుర్గను ప్రజాప్రతినిధులు, అధికారులు సత్కరించారు. సమావేశంలో విద్యుత్ లైన్‌మెన్ ఎలీషా, ఏఓ కె.మురళీకృష్ణ, డీటీ శ్రీలత, ఆర్ఐ కృష్ణమోహన్, ఎంఈవో పి.వెంకటేశ్వరరావు, లక్ష్మీపురం ఎంపీటీసీ సభ్యులు మోపిదేవి ద్వారకానాథ్, పంచాయతీ కార్యదర్శి పేర్ని మాధవేంద్రరావు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో రూ.2.30 లక్షల రికవరీకి ఆదేశం



ప్రజావేదిక సభలో పీడీ శివప్రసాద్ యాదవ్ తదితరులు

మోపిదేవి: ఉపాధి హామీ పథకం అమలులో తప్పుల తడక బయట పడింది. సుమారు 18 రోజుల పాటు క్షేత్రస్థాయిలో గ్రామసభలు, తనిఖీలు చేపట్టిన అధికారులకు విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం ఎంపీపీ రావి దుర్గావాణి అధ్యక్షతన మండల స్థాయి 2024– 25 సంవత్సరం నిర్వహించిన పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. ప్రతి పంచాయతీలోనూ అవినీతికి పాల్పడినట్లు బహిర్గతం కావడంతో అధికారులు విస్తుపోయారు. డ్వామా పీడీ శివప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ మండలంలోని 13 గ్రామ పంచాయతీల పరిధిలో ఉపాధి పనుల రూపంలో మొత్తం రూ.5.72 కోట్లు, పంచాయతీరాజ్ మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.3.99 కోట్లతో మొత్తం 9.72 కోట్లకు పనులు జరిగినట్లు తెలిపారు. అనేక తప్పిదాలు, ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించకపోవడంతో సిబ్బందిపై రూ.49 వేలు జరిమానాలు విధించినట్లు తెలిపారు. ఉద్యోగుల నుంచి రికవరీ కింద రూ.2.30 లక్షలు వసూలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. వీటితో పాటు మొక్కలు, పొడవు, వెడల్పులు సరిగా చేయకపోవడం వల్ల రూ.45 లక్షల పనులకు అభ్యంతరాలను క్వాలిటీ కంట్రోలువారికి అప్పగించినట్లు వివరించారు. మండల కో ఆప్షన్ సభ్యులు చందన రంగారావు, ఏపీడీ పి. రామమోహనరావు, జూనియర్ క్వాలిటీ అధికారి జయప్రసాద్, ఏవో పాండు రంగారావు, ఎస్‌టీఎం గౌరీశంకర్, ఎస్‌ఆర్‌పీ సూర్యచక్రం, విజిలెన్స్ ఏడీపీఓ సురేష్, ఏపీవోలు ముత్యాలు, కె.రవికుమార్, టీఏలు భాగ్యలక్ష్మి, హరిబాబు నాయక్‌తో పాటు మేట్‌లు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



సీసీ రోడ్డు శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ తదితరులు

నాగాయలంక: స్థానిక హైస్కూలు రోడ్డులో అంబేడ్కర్ నగర్ ఎస్సీ కాలనీ నుంచి తానయ్య మిల్లు వరకు 593 మీటర్లు సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శనివారం సాయంత్రం అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ శంకుస్థాపన చేశారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.50 లక్షలతో సీసీ రోడ్డు చేపట్టినట్లు పంచాయతీరాజ్ అధికారులు చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్(రాజా), మండల డీసీ చైర్మన్ బండ్రెడ్డి చినబాబు, సర్పంచ్‌లు కైతేపల్లి అంకాలు, అంబటి శ్యామ్‌ప్రసాద్ (పాలెం), దున్నా రాజేష్ (పెదపాలెం), ఉప సర్పంచ్ తలశిల నరసింహారావు (నాని), మాజీ సర్పంచ్ మండవ బాలవర్ధిరావు, తలశిల స్వర్ణలత, పంచాయతీరాజ్ డీఈఈ పి.సురేషబాబు, ఏఈఈ వి.విజయ్ తదితరులు పాల్గొన్నారు.

యోగాసనాలతో ఆరోగ్యం పదిలం



పులిగడ్డలో యోగా చేస్తున్న విద్యార్థులు



మచిలీపట్నంలో ఈకే బాలభాను విద్యాలయంలో విద్యార్థుల యోగాసనాలు



పెడన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

మచిలీపట్నంటౌన్: 11వ అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని శనివారం నగరంలో పలు సంస్థల్లో ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు విద్యాసంస్థల్లో విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది యోగాసనాలు చేశారు. వక్తలు మాట్లాడుతూ యోగాసాధనతో మానసిక ఆరోగ్యం, శారీరక దృఢత్వం పెరుగుతుందన్నారు. జీవితంలో యోగా భాగస్వామ్యం కావాలన్నారు. నగరంలోని మాస్టర్ ఈకే బాలభాను విద్యాలయం, బాలాజీ విద్యాలయం, జవ్వారుపేట శ్రీ వెంకటేశ్వర హైస్కూల్, లేడీ యాంప్థిల్ ప్రభుత్వ బాలికల కళాశాల తదితర పాఠశాలలు, కళాశాలల్లో యోగాసనాలు చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థలో విద్యార్థులు, ఉద్యోగులు, సిబ్బంది, పాఠకులు యోగాసనాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ జి.గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని మచిలీపట్నం న్యావాదుల సంఘం ఆధ్వర్యంలో న్యాయవాదులు యోగాసనాలు చేశారు. ఏపీఎస్‌ఆర్టీసీ మచిలీపట్నం డిపో గ్యారేజీలో ఉద్యోగులు, సిబ్బంది యోగాసనాలు చేశారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది డిపో ఆవరణను శుభ్రపరిచారు.

పెడన: యోగాసనాల సాధనతో ఆరోగ్యం పదిలమవుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణం, మండలంలోని వివిధ ప్రాంతాల్లో శనివారం ఉదయం యోగాసనాల సాధన నిర్వహించారు. పట్టణంలోని శ్రీబొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన యోగా సాధనలతో మున్సిపల్ కమిషనర్ ఎల్.చంద్రశేఖరరెడ్డి, ప్రిన్సిపాల్ రామారావు, అధ్యాపకులు, మున్సిపల్ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాలన్నారు. యోగా చేయడం వల్ల ఏకాగ్రత పెరుగుతుందని వివరించారు. మానసిక ప్రశాంతతత చేకూరుతుందని పేర్కొన్నారు. మండల పరిధిలోని పెనుమల్లి జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన యోగా సాధనలలో జెడ్పీటీసీ అర్జా వెంకటనగేష్, టీడీపీ అధ్యక్షుడు శెలపాటి ప్రసాద్, కార్యదర్శి శీరం ప్రసాద్, ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్, ఎంపీడీవో అరుణకుమారి, ఎస్ఐ సత్యనారాయణ, వివిధ శాఖలకు చెందిన అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. మండల వ్యాప్తంగా వార్డు, గ్రామ సచివాలయాల పరిధిలో కూడా యోగా సాధన తరగతులు నిర్వహించారు. బంటుమిల్లి, కృత్తి వెన్ను మండలాల పరిధిలో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, కార్యాలయాలు, సచివాలయాల్లో యోగా దినోత్సవం నిర్వహించారు.

అవనిగడ్డ: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని మండలంలోని పలు ప్రాంతాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో విద్యార్థులు యోగా చేశారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే యోగా నేర్చుకోవాలన్నారు. ఎంపీపీ తుంగల సుమతీదేవి, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, ఎంపీడీవో మరియాదేవి, డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఉమారాణి, ఎస్వీ నరసింహారావు, హైస్కూల్ హెచ్ఎం కందుల సుజాత, పలువురు అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పులిగడ్డ రెసిడెన్సియల్ స్కూల్‌లో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్, ప్రిన్సిపాల్ ఎస్‌టీపీ కుమార్, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావుతో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. నియోజకవర్గంలోని మోపిదేవి, నాగాయలంక, కోడూరు, చల్లపల్లి, ఘంటసాల మండలాల్లో యోగా దినోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉద్యోగులు ఆసనాలు వేశారు.

స్మార్ట్ మీటర్లను వెంటనే తొలగించండి

గుడివాడ టౌన్: చిన్న తరహా పరిశ్రమలకు, గృహాలకు ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ మీటర్లు వెంటనే తొలగించాలని శ్రామిక హక్కుల పోరాట సంఘం నాయకుడు ఆర్.రఘు డిమాండ్ చేశారు. శనివారం ది గుడివాడ ఇండస్ట్రియల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక ఏలూరు రోడ్‌లోని విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి, వినతి పత్రాన్ని సమర్పించారు. ఆయన మాట్లాడుతూ గుడివాడ ఆటోనగర్‌లో స్మార్ట్ మీటర్లు బిగించిన తరువాత 37 మందికి గత బిల్లులతో పోలిస్తే మూడు రెట్లు అధికంగా రీడింగ్‌లు చూపించాయన్నారు. గతంలో రూ. 3 వేలు బిల్లు చెల్లించేవారికి ఇప్పుడు రూ.16 వేలు బిల్లు వచ్చిందని రూ. 4 వేలు చెల్లించే వారికి రూ.22 వేలు బిల్లు చూపించడం విచిత్రంగా ఉందన్నారు. యూనియన్ అధ్యక్షుడు హమీద్, ప్రధాన కార్యదర్శి ఖుర్దూస్, గౌరవాధ్యక్షుడు టి. లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు 14 మంది ఎంపిక



చల్లపల్లి: లయన్స్ క్లబ్ ఆఫ్ చల్లపల్లి వీఆర్‌కేనగర్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక నర్రా రమాదేవి, సాయిబాబు మల్టీపర్పస్ సెంటర్లో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 14 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపికచేశారు. కంటి వైద్యులు డాక్టర్ వెంకట్రావు 35 మందిని పరీక్షించి వారిలో 14 మందిని ఎంపికచేశారు. వీరికి గూడూరు నేత్రాలయంలో ఆపరేషన్లు చేయిస్తామని క్లబ్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రాయపాటి రాధాకృష్ణ, కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్ ఇతర సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



పామర్రు: స్థానిక జెడ్పీ హైస్కూల్లో ఎస్‌ఆర్‌ఐ డోనర్స్ ఫర్ నోట్ బుక్స్ స్కీం అనే కార్యక్రమంలో భాగంగా వాసవీ ఇంటర్నేషనల్ దుబాయికి చెందిన పీసీ హరి ప్రసాద్ సౌజన్యంతో 500 మంది విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలను శనివారం అందజేశారు. అనంతరం స్థానిక వాసవీ కల్యాణ మండలంలో డాన్ టు డస్క్‌లో భాగంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడు ఘంటసాల త్రివిక్రమ సాయిరాం, కార్యదర్శి కెవీ జనార్దనరావు, కోశాధికారి వెంకట ప్రణీత్, సభ్యులు సాయిబాబు, భరతుడు, పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.